కోరుట్లలోని సమీకృత మార్కెట్

మార్కెట్‌లో చెల్లాచెదురుగా పడి ఉన్న పరికరాలు

# అసంపూర్తిగా సమీకృత మార్కెట్

- త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ ప్రజల వేడుకోలు

కోరుట్ల, మార్చి 30: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అన్ని వర్గాల ప్రజల సౌకర్యం కోసం సమీకృత మార్కెట్ల నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021–22లో శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఆధునిక హంగులతో ఒకే చోట కూరగాయలు, నాన్‌వెజ్ మార్కెట్ నిర్వహణకు రూపకల్పన చేసింది. పట్టణాల్లోని పుట్‌పాత్‌లు, మురుగు కాల్వలపై కూరగాయలు, మటన్, చికెన్, చేపలను అపరిశుభ్ర వాతావరణంలో విక్రయిస్తున్న నేపథ్యంలో వీటికి చెక్ పెట్టెందుకు అత్యాధునిక వసతులతో సమీకృత వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ల నిర్మాణానికి పూనుకుంది. ప్రజలకు అందుబాటులో ఉండేలా కూరగాయలు, మాంసం, ఇతర నిత్యావసరలు ఒకే చోట లభించేలా సమీకృత మార్కెట్లు నిర్మించింది. కాగా, కోరుట్ల పట్టణంలో చేపట్టిన సమీకృత మార్కెట్‌కు ప్రస్తుతం నిధులు మంజూరు కాక అసంపూర్తిగా నిలిచిపోయింది.

*రూ. 6.50 కోట్లతో మార్కెట్ నిర్మాణం*

కోరుట్ల పట్టణంలోని ఆదర్శనగర్, అర్బన్‌కాలనీ, ఏస్కొనిగుట్ట, అయోధ్యనగర్ కాలనీల ప్రజల సౌకర్యార్థం మెట్‌పల్లి రోడ్డులోని కోరుట్ల వ్యవసాయ మార్కెట్ ఆవరణలో 1.20 ఎకరాల విస్తీర్ణంలో సకల హంగులతో సమీకృత మార్కెట్‌ను నిర్మించారు. జీవో 65 నిధులు రూ. 4.50 కోట్లు, పట్టణ ప్రగతి నిధులు రూ. 2 కోట్లు వెచ్చించి పనులు చేపట్టారు. 90 శాతం పనులు పూర్తి కావచ్చాయి. కాగా, కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. ఆలనా పాలన కరువై మార్కెట్‌లో నిర్మించిన స్టాల్స్, విద్యుత్ ఉపకరణాలు దెబ్బతిన్నాయి. మార్కెట్‌ను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తే శివారు ప్రాంత ప్రజలకు సౌలభ్యంగా మారనుంది.

*ఒకే ప్రాంగణంలో..*

సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్లలో పండ్లు, పూలు, మటన్, చికెన్, చేపలు విక్రయించేందుకు ప్రత్యేకంగా స్టాళ్లు ఏర్పాటు చేశారు. కూరగాయల విక్రయదారుల కోసం 48 స్టాల్స్, పండ్లు, పూల అమ్మకాల కోసం 14, మాంసం విక్రయించేందుకు 28 స్టాళ్లు నిర్మించారు. గుత్తేదారుకు బిల్లులు రాకపోవడంతో ఇంటర్నల్ సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఎంట్రెన్స్ ప్లాజా (స్వాగత తోరణం), బోరు, స్టోర్ రూమ్, స్టోరేజీ గదులు, ప్రహరీ, టాయిలెట్స్ నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమీకృత మార్కెట్ నిర్మాణ పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా ఉగాది వేడుకలు

కొడిమ్యాల: కొండగట్టు ఆలయ ఆవరణలో పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకుడు జితేంద్రప్రసాద్

జగిత్యాల/మెట్‌పల్లి/కోరుట్ల/సారంగాపూర్/మేడిపల్లి/పెగడపల్లి/మల్లాపూర్/కథలాపూర్/ మారుతీనగర్/జగిత్యాల టౌన్/కొడిమ్యాల/కోరుట్లరూరల్, మార్చి 30: జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది పచ్చడి, భక్షాలు, పిండి వంటలు చేసుకొని కుటుంబ సభ్యులంతా కలిసి ఆరగించారు. చిన్నారులకు అమ్మమ్మలు, నానమ్మలు కుడుకలు, చెక్కర బిల్లల పేర్లు మెడలో వేశారు. అర్చకులు పంచాంగ శ్రవణం చేశారు. అలాగే, జిల్లాలోని ఆలయాల్లో అర్చకులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. కథలాపూర్ మండలం పెగ్గెర్లలోని లక్ష్మీనృసింహస్వామి, సిరికొండలోని మల్లికార్జునస్వామి, తుర్తిలో హనుమాన్ ఆలయాల్లో విప్ ఆది శ్రీనివాస్ పూజలు చేశారు. జగిత్యాలలోని వాల్మీకి ఆవాసంలో సేవా భారతి ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించగా, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ హాజరయ్యారు. మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు జితేంద్రప్రసాద్ పంచాంగం చదివి వినిపించారు.

## యాదవులు అన్నిరంగాల్లో ముందుండాలి

- అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీంద్రనాథ్ యాదవ్

పెద్దపల్లి రూరల్, మార్చి 30: సమాజంలో నిలదొక్కుకోవాలంటే యాదవులు అన్ని అన్ని రంగాల్లో ముందుండాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీంద్రనాథ్ యాదవ్ అన్నారు. పెద్దపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉగాది పురస్కారాల ప్రదానోత్సవానికి ఆయన హాజరయ్యారు. మొదటి సారిగా జిల్లాకు వచ్చిన ఆయనను అఖిల భారత యాదవ మహాసభ నాయకులు ఘనంగా సన్మానించారు. అంతకు ముందు శ్రీ కృష్ణుడి విగ్రహం వద్ద వేదపండితుడు శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చింతల రవీంద్రనాథ్ యాదవ్ మాట్లాడారు. జిల్లాలో యాదవ సామాజిక వర్గం బలంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో జిల్లాలో కనీసం ఒక ఎమ్మెల్యే స్థానం అయినా దక్కించుకునేలా ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేయాలని సూచించారు. అనంతరం వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి అతిథులు ఉగాది పురస్కారాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జేకే శేఖర్ యాదవ్, మహేందర్ నాథ్ యాదవ్, పోచబోయిన శ్రీహరియాదవ్, గంట రాము లు యాదవ్, కన్నెబోయిన ఓదెలు యాదవ్, మేకల మల్లేశం యాదవ్, మారం తిరుపతి యాదవ్, వేల్పుల నాగరాజు యాదవ్, శిలారపు పర్వతాలు యాద వ్, అట్ల సాగర్ యాదవ్, పొలగాని సతీష్ యాదవ్, వేల్పుల కుమార్ యాదవ్, పోసాని శ్రీనివాస్ యాదవ్, బత్తిని లక్ష్మన్ యాదవ్, మంద భాస్కర్ యాదవ్, నర్లపోల్ రాజు యాదవ్, పెంట రవి యాదవ్, కొండ రవి యాద వ్, ఆవుల రాజేశ్ యాదవ్, చెల్కల జితేందర్ యాదవ్, నాగరాజు యాదవ్, రాజేశం యాదవ్ పాల్గొన్నారు.

## వైభవంగా ఉగాది జాతర

ఇబ్రహీంపట్నం/మెట్‌పల్లి రూరల్, మార్చి 30: ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండలోని లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉగాది జాతర ఉత్సవాలను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి వారిని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన మామిడి చిన్నయ్య పటేల్ వారసులు రూ.3.50 లక్షలతో తయారు చేయించిన రథాన్ని గ్రామాభివృద్ధి కమిటీకి అప్పగించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దొంతుల శ్యామల–తుకారం, మాజీ ఎంపీటీసీ పొనకంటి వెంకటి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామంలో లక్ష్మీనృసింహ స్వామి జాతర నిర్వహించారు. స్వామి వారిని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి ఉన్నారు.

## ధర్మపురిలో భక్తుల రద్దీ

ధర్మపురి, మార్చి 30: ఉగాది పర్వదినం సందర్భంగా ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో స్వామి వారలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలోని శేషప్ప కళావేదికపై అర్చకులు పంచాంగ శ్రవణం గావించారు. అనంతరం వివిధ కళల యందు నిష్ణాతులైన వారికి దేవస్థానం పక్షాన ఉగాది పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, చైర్మన్ జక్కు రవీందర్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఖోఖో క్రీడాకారుడికి సత్కారం

నవీన్‌కుమార్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

కోరుట్ల, మార్చి 30: పట్టణానికి చెందిన వాసం నవీన్‌కుమార్ ఆల్ ఇండియా ఖోఖో సివిల్ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఖోఖో పోటీలకు తెలంగాణ ఖోఖో సివిల్ సర్వీస్ జట్టు కెప్టెన్‌గా ఎంపికయ్యారు. కాగా, పట్టణంలో భారతీయ సంఘం నాయకులు ఆదివారం నవీన్‌కుమార్‌ను శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. నవీన్‌కుమార్ ప్రస్తుతం కథలాపూర్ మండలంలో పీఈటీగా పని చేస్తున్నాడు. ఈ కార్యక్రమంలో నాయకులు పరంధాము, రాజేశం, గోపాల్, రాజు, అమర్‌నాథ్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## 'అగ్నిపథ్'కు ఎంపికైన యువకుడికి స్వాగతం

కథలాపూర్, మార్చి 30: భూషణరావుపేట గ్రామానికి చెందిన ఏనుగు సంతోష్ అగ్నిపథ్‌కు ఎంపికై ఆదివారం స్వగ్రామానికి రాగా, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. గ్రామస్తులు, తోటి మిత్రులు గ్రామ శివారు నుంచి డీజే సౌండ్స్‌తో యువకుడి ఇంటి వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. నాయకులు, తోటిమిత్రులు సంతోష్‌ను శాలువాలతో సన్మానించి, అభినందించారు. సంతోష్ 2022–23 విద్యా సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేశారు. అగ్నిపథ్‌లో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించారు.

సంతోష్‌ను సన్మానిస్తున్న నాయకులు, గ్రామస్తులు

## కొండగట్టులో అభివృద్ధి పనులకు భూమి పూజ

కొడిమ్యాల, మార్చి 30: కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిధులు రూ. 35 లక్షలతో జీఐ షెడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీకాంతరావు, పర్యవేక్షకుడు చంద్రశేఖర్, హరిహరనాథ్, సునీల్, సింగిల్ విండో చైర్మన్ మేన్నేని రాజనర్సింగరావు, నాయకులు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ఎలిమేస్, మహేశ్వర్‌రెడ్డి, రవీందర్, శ్రీకాంత్, అజయ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఈద్గా వద్ద ఏర్పాట్ల పరిశీలన

కోరుట్ల, మార్చి 30: పట్టణంలోని అయ్యప్ప గుట్ట వద్ద గల ఈద్గా మైదానంలో రంజాన్‌ను పురస్కరించుకొని చేపడుతున్న ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ ఆదివారం పరిశీలించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

## ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు

కంటి శస్త్రచికిత్స చేసిన వారితో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల, మార్చి 30: జగిత్యాలలోని పావని కంటి దవాఖాన ఆపి, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 20 మంది పేదలకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేసి, మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులు టీవీ సూర్యం, కాశీరావు, సుధాకర్ రావు, కొత్త ప్రభాకర్, కోరే గంగమల్లు, శరత్ రావు, తిరుపతి, జంబర్తి రాజ్ కుమార్, పెద్దింటి రాజు, ప్రవీణ్ రావు, శ్రీరామ్ భిక్షపతి, మదన్, స్వామి రెడ్డి, శేఖర్, దవాఖాన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీ కెనాల్‌లో గల్లంతైన చిన్నారి మృతి

రామగిరి, మార్చి 30: పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం లొంకకేసారం గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కెనాల్‌లో గల్లంతైన రెండేళ్ల చిన్నారి మృతి చెందగా, పండుగ పూట ఆ కుటుంబంలో విషాదం నింపింది. ఆదివారం ఉదయం కెనాల్‌లో మృతదేహం లభ్యమైంది. శనివారం మధ్యాహ్నం ఎస్సారెస్పీ కెనాల్ రోడ్డుపై ఆడుకుంటూ దాస్ గెల్లి (2) అనే చిన్నారి ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడిపోయింది. శనివారం రాత్రి కెనాల్‌లో నీటి విడుదలను నిలిపివేసి వెతికినా దొరకలేదు. తిరిగి ఆదివారం ఉదయం సహాయక చర్యలు కొనసాగిస్తుండగా కెనాల్‌లో ప్రమాదం జరిగిన స్థలం నుంచి సుమారు 700 మీటర్ల దూరంలో మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పెద్దపల్లి దవాఖానకు తరలించారు.

# ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలి

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న పురోహితుడు విషుశర్మ

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు

జగిత్యాల/మెట్‌పల్లి/, మార్చి 30: విశ్వావసు నామ సంవత్సరంలో జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఆకాంక్షించారు. పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ఆయన అధ్యక్షతన విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహించారు. పురోహితుడు తిగుళ్ల విషుశర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మాట్లాడుతూ, ఈ సంవత్సరంలో వర్షాలు సమృద్ధిగా పడి పాడి పంటలతో విలసిల్లాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, నాయకులు గట్టు సతీశ్, అల్లాల ఆనంద్‌రావు, తుమ్మ గంగాధర్, వొద్దినేని హరిచరణ్ రావు, లోక బాపురెడ్డి, దేవేందర్ నాయక్, అవారి శివకేసరి బాబు, అనురాధ, అయిల్నేని శిరీష–వెంకటేశ్వర్‌రావు, మారు సాయిరెడ్డి, పడిగెల గంగారెడ్డి, శీలం ప్రవీణ్, శ్రీనివాస్, గంగారెడ్డి, అల్లాల దామోదర్ రావు, నాగం భూమయ్య, కొల్ముల రమణ, సాగి సత్యం రావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, మెట్‌పల్లి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించగా, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మనుమయ సంఘం అధ్యక్షుడు మురళి, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, కోశాధికారి స్వామి, మాజీ కౌన్సిలర్ బుచ్చిరెడ్డి, నాయకులు గజేంద్రభీష్మాచారి, వెంకటస్వామి, అశోక్, రామకృష్ణ, కుమార్, గంగాధర్, వంశీ, వేణు, లక్ష్మణ్, శంకర్, రాజన్న, కృష్ణ, శ్రీధర్ పాల్గొన్నారు.

పట్టాలు అందుకున్న చిన్నారులతో ఉపాధ్యాయులు

# సరస్వతీ శిశు మందిర్‌లో గ్రాడ్యుయేషన్ డే

కోరుట్ల, మార్చి 30: పట్టణంలోని సరస్వతీ శిశు మందిర్‌లో ఆదివారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా యూకేజీ విద్యార్థులను ఒకటో తరగతికి ప్రమోట్ చేస్తూ పట్టాలు పంపిణీ చేశారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకురాలు నీలి వాసవి, కరస్పాండెంట్ నీలి శ్రీనివాస్, ప్రధానాచార్యులు గోపు వెంకటేశ్, ప్రబంధకారిణి ప్రతినిధులు శంకర్, రమేశ్, శివప్రసాద్, మనోజ్‌కుమార్, కొత్త సందీప్ పాల్గొన్నారు.

ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, నాయకులు

## ఐకమత్యంతోనే అభివృద్ధి

జగిత్యాల, మార్చి 30: ఐకమత్యంతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించవచ్చని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం మున్నూరు కాపు వర్తక సంఘం అధ్యక్షుడు అంజయ్య పటేల్ ఆధ్వర్యంలో ఉగాది సంబురాలు నిర్వహించారు. ఉగాది పచ్చడి, భక్షాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, ఈ సంవత్సరంలో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్నూరు కాపు సంఘం నాయకుడు హరి అశోక్ కుమార్, కల్యాణ మండపం అధ్యక్షుడు బండారి రాజ్‌కుమార్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కందుకూరి రవి బాబు, వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి జంగిలి రవి పటేల్, జర్నలిస్టుల ఫోరమ్ అధ్యక్షుడు వంగల రమేశ్, నాయకులు కొక్కు గంగాధర్, చిట్ల రమణ, శీలం ప్రవీణ్, పుప్పాల రాజేశ్, ములాసపు రాజన్న, జంగిలి కృష్ణానంద రెడ్డి, పుప్పాల నర్సింగరావు, ఏనుగుల రాజేందర్, చిట్ల శ్రీనివాస్, కొలగాని సత్యం, మాసం రమేశ్, జంగిలి అనిల్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌ను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలి

జగిత్యాల రూరల్, మార్చి 30: అంబేద్కర్‌ను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి–లక్ష్మణ్ పేర్కొన్నారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ స్మరణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం జగిత్యాలలోని తహసీల్ చౌరస్తా వద్ద రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిత్తారి ప్రభాకర్, నర్ర రాజేందర్, మద్దెల నారాయణ, బొల్లం విజయ్, విజయ్, శంకర్, సత్తయ్య, లక్ష్మీనారాయణ, పులి గోవర్ధన్, అంజయ్య, రాజు, లచ్చయ్య, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

## నిధులు మంజూరు చేయాలని వినతి

కొడిమ్యాల, మార్చి 30: మండల కేంద్రంలో శాలివాహన (కుమ్మరి) సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ని ఆదివారం సంఘం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాజేశం, స్వామి, శ్రీనివాస్, శంకర్, కుంటయ్య, తిరుపతిరెడ్డి, రాకేశ్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్సీ పరామర్శ

జగిత్యాల రూరల్, మార్చి 30: జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన బేతి రాజిరెడ్డి నివాసంలో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఆదివారం ఘటనా స్థలాన్ని మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

## పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ ఆజాదీ ఫెడరేషన్ నాయకులు

హుజూరాబాద్ టౌన్, మార్చి 30 : పార్లమెంట్‌లో బీసీ బిల్లు ఆమోదించాలని ఢిల్లీలో ఏప్రిల్ ఒకటిన బీసీ ఆజాదీ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ చేస్తున్న ఆమరణ దీక్షకు మద్దతుగా అదే రోజు నుంచి హుజూరాబాద్‌లో బీసీ ఆజాదీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరవధిక దీక్ష చేపట్టనున్నట్లు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుడికాల భాస్కర్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా దవాఖాన ఎదుట ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద ఢిల్లీలో చేపట్టే ఆమరణ దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుడికాల భాస్కర్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని, తెలంగాణ బీసీ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించి, 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో బీసీ ఆజాదీ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ ఆమరణ నిరాహార దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ ఆజాదీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రాజు పాల్గొన్నారు.

## సంస్కృతీసంప్రదాయాలను పరిరక్షించాలి

జగిత్యాల, మార్చి 30: సంస్కృతీసంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపు, ఎస్‌కేఎన్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, ప్రజాప్రతినిధులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. అలాగే, ఒకటో వార్డులో వివేకానంద విద్యానగర్ కమిటీ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ హాజరై పూజలు చేశారు. అలాగే, జిల్లా వీరశైవ జంగమ సమాజ సభ్యుల ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సర సూర్య సిద్ధాంత ముక్తేశ్వర పంచాంగాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.

## మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

జగిత్యాల, మార్చి 30: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్ ఉర్దూ మీడియం పాఠశాలలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయగా, ఆయన హాజరై మాట్లాడారు. టీఆర్‌నగర్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ సదాకర్, మాజీ కౌన్సిలర్ చాంద్‌పాషా, కుద్రత్, సాబీర్, హమీద్, నాయకులు, తదతరులు పాల్గొన్నారు.

సారంగాపూర్, మార్చి 30: మండల కేంద్రంలో ఆదివారం ముస్లింలకు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కోండ్ర రాంచందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## సంప్రదాయాలను పరిరక్షించడం అభినందనీయం

సారంగాపూర్, మార్చి 30: నాటి సంప్రదాయాలను కాపాడుతూ, ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహిస్తుండడం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కొనియాడారు. బీర్‌పూర్‌లో ఉగాదిని పురస్కరించుకొని ఆదివారం నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలను ఆయన ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీబీ జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావు, ఆలయ మాజీ చైర్మన్ నేరెళ్ల సుమన్ గౌడ్, నాయకులు గుర్రాల రాజేందర్ రెడ్డి, గోనే రమణారావు, వంగపెల్లి కృష్ణారావు, హరీశ్, సుధాకర్, శ్రీనివాస్, రాజేశం, మహేందర్, అర్చకులు సంతోష్ చార్యులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ గ్రేటర్ సభ్యుల ఔదార్యం

విద్యార్థులకు నూతన వస్త్రాలు అందిస్తున్న వాసవి క్లబ్ గ్రేటర్ సభ్యులు

కోరుట్ల, మార్చి 30: పట్టణానికి చెందిన వాసవి క్లబ్ గ్రేటర్ సభ్యులు ఆదివారం మాతృ సేవా సంస్కృతి ఆవాసంలో ఆశ్రయం పొందుతున్న అనాథ చిన్నారులకు ఉగాది పండుగను పురస్కరించుకొని నూతన వస్త్రాలు, పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎల్లంకి కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి ఒజ్జల వెంకటరమణ, కోశాధికారి గ్యాదె నాగరాజు, బట్టు హరికృష్ణ, శికారి రామకృష్ణ, ముక్క మనోహర్, ఎలిమిల్ల మనోజ్, మానుక ప్రసాద్, నీలి శ్రీకాంత్, జనార్దన్, కోటేశ్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన

కథలాపూర్, మార్చి 30: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు సత్యనారాయణ, రాజేశం పేర్కొన్నారు. కథలాపూర్ మండలం పోతారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో వసతులు, విద్యనందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి గ్రామానికి చెందిన ఇంద్రాల రాములు రూ. 50 వేలు విరాళంగా అందించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, సీఆర్పీలు అజయ్, కృష్ణప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## లక్ష్మీనృసింహస్వామి జాతర

కథలాపూర్, మార్చి 30: పెగ్గెర్లలోని లక్ష్మీనృసింహస్వామి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. బాపురెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఆయన వెంట నాయకులు చెల్లపెల్లి అంజయ్య, వర్ధినేని నాగేశ్వర్‌రావు, ప్రతాప్‌రెడ్డి, జలపతిరెడ్డి, కుంట నరేశ్, గడ్డం శేఖర్‌రెడ్డి, గంగారెడ్డి, వంగరి రాజ్‌కుమార్, బచ్చు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ స్థానాచార్యుడికి ఉగాది పురస్కారం

కఫీందర్‌కు పురస్కారం అందజేస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

కొడిమ్యాల, మార్చి 30: కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయ స్థానాచార్యులు కఫీందర్ ఉగాది పురస్కారం అందుకున్నారు. ఉగాదిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆలయాల అర్చకులకు సత్కారం చేసి, ఉగాది పురస్కారాలు అందజేశారు. ఈ నేపథ్యంలో కఫీందర్‌కు దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యార్, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ పురస్కారం అందజేసి, శాలువాతో సత్కరించారు.

## అంజన్న సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే పూజలు

కొడిమ్యాల, మార్చి 30: కొండగట్టు ఆంజనేయ స్వామిని ఆదివారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి, శాలువాతో సత్కరించారు. ఇక్కడ స్థానిక నాయకులు, తదితరులున్నారు.

తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ దంపతులు